క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మదనాపురం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మదనాపురం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని కరివెన ఊకచెట్టు వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా శనివారం అర్ధ రాత్రి 2 గంటల సమయంలో గోపన్‌పేట గ్రామ శివారులో రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ల యాజమానులు ఆంజనేయులు, మోట్లంపల్లి రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఛత్రపతి సాహు మహరాజ్‌కు ఘన నివాళి



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల ఎస్సీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జ్యోతిరావుపూలే చౌరస్తాలో ఆదివారం ఛత్రపతి సాహుమహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఆశన్న ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, పెబ్బేరు మండల బీసీ ఫెడరేషన్ కన్వీనర్ శివకుమార్ నాయుడు, సంపత్‌కుమార్, రాముడు, వంశీ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మదనాపురం: మదనాపురం ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను శాలువాలతో సత్కరించారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం పాఠశాలకు రూ.40 వేల విలువైన డిజిటల్ ప్రొజెక్టర్ బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట చలపతి, రమణ, సుందర్‌రెడ్డి, వెంకటయ్య, గోపాల్, మధుసూదన్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే జీఎమ్మార్ పర్యటన

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాల వద్ద లైబ్రరీ భవనం, సైన్స్‌ల్యాబ్ భవన నిర్మాణ పనులతో పాటు విలియంకొండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమాల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న హాజరై పర్యటను విజయవంతం చేయాలని కోరారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పాన్‌గల్: భార్యను వేధించిన ఘటనలో భర్తపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వీపనగండ్ల మండలం వల్ల భాపూర్ తండాకు చెందిన ఇస్లావత్ పార్వతిని 15 ఏళ్ల క్రితం పాన్‌గల్ మండలం కిష్టాపూర్‌తండాకు చెందిన రాత్లావత్ భాస్కర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. అయితే ఇటీవల దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఈనెల 28న అత్తింటివారు పార్వతిని అదనపు కట్నం కోసం దాడి చేసి ఇంటి నుంచి గెంటివేశారు. దీంతో పార్వతి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జ్ఞాపకాలకు సజీవ సాక్ష్యం ఫొటో



రాజోళి: జ్ఞాపకాలను మన ముందు ఉంచి, సంతోషాన్ని తీసుకొచ్చేదే ఫొటో అని ఫొటోగ్రాఫర్ల మండల అధ్యక్షుడు కాకే సుధాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం రాజోళిలో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్లు ర్యాలీ నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల క్యాలెండర్లు, బుక్‌లెట్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రఘు, శ్రీకాంత్, కిరణ్, అడివి స్వామి, రాజు, వీరేష్, తిరుమలేష్ తదిదరులు పాల్గొన్నారు.

బాలికల విద్యకు భరోసా.. కస్తూర్బా

- హాస్టల్ వసతి, పౌష్టికాహారం, నాణ్యమైన విద్య
- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్లంలో బోధన
- సీఈసీ, బైపీసీ, ఎంపీసీతో పాటు ఒకేషనల్ కోర్సులు



మదనాపురంలోని కస్తూర్బా విద్యాలయం

మదనాపురం: కస్తూర్బా గాంధీ విద్యాలయాలు విద్యార్థినులకు బంగారు భవిష్యత్‌కు భరోసాగా నిలుస్తున్నాయి. చదుకోవాలన్న నిరుపేద బాలికలకు వరంగా మారాయి. మంచి ఫలితాలు సాధిస్తున్న ఈ విద్యాలయాల్లో బాలికలకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. మహిళా ఉపాధ్యాయినులే పాఠాలు బోధిస్తారు. 6వ తరగతిలో అడ్మిషన్ పొందితే ఇంటర్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న ఎంపీహెచ్ కోర్సును కూడా ఇందులో బాలికలకు అందిస్తున్నారు. రుచికరమైన ఆహారంతో పాటు హాస్టల్ వసతి, నాణ్యమైన విద్య ఉచిత దుస్తులు, పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించి విద్యాబోధన చేస్తారు. విద్యతో పాటు విశ్వాసం పెంపొందించే విధంగా యోగా వంటి వాటిని కూడా ఇందులో నేర్పిస్తారు. ఆర్థిక పరిస్థితుల వల్ల మధ్యలో బడి మానేసిన పిల్లలు చదువుకోవాలనే ఆసక్తి ఉన్న పేద పిల్లలకు ఈ పాఠశాలలో మొదటి ప్రాధాన్యత ఉంటుంది. బాలికలకు సమగ్ర విద్యను అందిస్తూ వారిలో ఉన్న నైపుణ్యాలను మరింత మెరుగుపెట్టాలనే లక్ష్యంతో కస్తూర్బా విద్యాలయాలు ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మండలానికి ఒకటి చొప్పున 13 ఏళ్ల క్రితం ఈ విద్యాలయాలు ఏర్పాటు చేసి పక్క సొంత భవనాలు నిర్మించారు. మొదట్లో తెలుగు మీడియంలో ప్రారంభమైన విద్యాలయాలు క్రమంగా ఇంగ్లీష్ మీడియంలోకి మార్చి విద్యా బోధన చేస్తున్నారు. ఇప్పుడు ఆరవ తరగతిలో ఇంగ్లీష్ మీడియం అడ్మిషన్ తీసుకుంటున్నారు.

మొదట్లో 8 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే బోధన ఉండేది. అనేక మంది బాలికలు పదో తరగతి తర్వాత ఉన్నత విద్యను చదువుకోవడం లేదని గ్రహించిన విద్యాశాఖ కేజీబీల్లోనే ఇంటర్ ఒకేషనల్ కోర్సును ప్రవేశపెట్టింది. దీంతో బాలికల విద్యాభివృద్ధికి కేజీబీవీలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. అధునాతన డిజిటల్ క్లాస్ రూమ్‌లు, వెయిటింగ్ హాల్స్ తదితర వాటిని ఏర్పాటు చేసి భవనాలు నిర్మించడంతో బాలికలు చదువుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

అప్‌డేట్ అయిన కేజీబీవీలు

అమరచింతలోని కేజీబీవీలో ఎంపీసీ, బైపీసీ ఆత్మకూరులో సీఈసీ, ఎంపీహెచ్ డబ్ల్యూ, గోపాల్‌పేటలో సీఈసీ, ఎంపీహెచ్ డబ్ల్యూ, శ్రీరంగాపూర్‌లో ఎంపీసీ, బైపీసీ, వనపర్తిలో ఎంపీసీ, బైపీసీ, ఖిల్లఘనాపురంలో కంప్యూటర్ సైన్స్ ఏఐ, పాన్‌గల్‌లో కంప్యూటర్ సైన్స్ ఏఐ, మదనాపురంలో ఫార్మా టెక్నాలజీ, కొత్తకోట అకౌంటెంట్ అండ్ టెక్నీషియన్, చిన్నంబావిలో బైపీసీ, ఎంఎల్‌టీ కోర్సులను అందిస్తున్నారు. అలాగే ఎంఈడీ చేసిన టీచర్లతో ఉత్తమ బోధన చేస్తున్నట్లు ప్రిన్సిపల్ సూచిస్తున్నారు.

బాలికలకు ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే స్పందించి ప్రాథమిక చికిత్స చేసేందుకు ప్రతి కేజీబీవీలో ఒక ఏఎన్‌ఎంను నియమించారు. ఇక ప్రతీరోజు ముగ్గురు టీచర్లు నైట్ డ్యూటీలో ఉంటారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో పాటు కాస్మోటిక్ కిట్లు కూడా అందిస్తారు.

బాలికలకు బంగారు భవిష్యత్



చదువుకోవాలన్న ఆసక్తి ఉన్న బాలికలకు కేజీబీలు బంగారు భవిష్యత్‌ను ఇస్తాయి. అనాథ పిల్లలకు బడి మానేసిన ఆర్థికంగా వెనుకబడిన బాలికలకు చదువుకు దూరం కాకుండా వారిని దరి చేర్చి ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో కేజీబీలు ఏర్పాటు చేశారు. ఇందులో నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్య శిక్షణ పౌష్టికాహారం, స్నాక్స్, పండ్లు, పాలు, నెలలో రెండుసార్లు మటన్ లేదా చికెన్ అందిస్తాం.

– రేణుక, ఎస్‌ఒ, కేజీబీవీ మదనాపురం

ఇంటర్ వరకు చదువుకుంటా అనుకోలేదు



నా లాంటి పేద విద్యార్థినులు చదువుకునేందుకు కేజీబీవీలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నా యి. పదో తరగతి పూర్తి అయి తే ఇంటర్ వేరే ఊరికి వెళ్లి చదువుకోవాల్సి వస్తుందేమో.. చదువు మానేద్దామని అనుకున్నాను. కానీ ప్రస్తుతం కేజీబీవీలోనే ఇంటర్ వరకు అప్డేట్ చేయడం వల్ల ఇంటర్‌లో చేరాను. కేజీబీవీలు ఇంటర్ వరకు అప్‌డేట్ చేయడం మంచి విషయం.

– విషిత, ఇంటర్ ఫస్ట్ ఇయర్, మదనాపురం

ఉద్యోగం సాధించడమే లక్ష్యం



నేను చదువుతున్న పాఠశాలలోనే 12వ తరగతి వరకు అప్డేట్ చేయడం వల్ల నేను కూడా ఇంటర్‌లో కంటిన్యూ అవుతున్నాను. ఇంటర్‌లో చేరడం చాలా ఆనందంగా ఉంది. డిగ్రీ వరకు చదువుకొని ఎలాగైనా మంచి ఉద్యోగం సాధిస్తాను. బాలికలందరూ కేజీబీవీలను సద్వినియోగం చేసుకొని చదువుకుంటే ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చు.

–శ్రీ కావ్య, ఇంటర్ మొదటి సంవత్సరం

పంచ సూత్రాలతో సంఘాలు బలోపేతం



మహిళల సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీలు

గట్టు: గ్రామ సంఘాలు పంచసూత్రాలను పాటించడం ద్వారా మరింత బలంగా తయారవుతాయని రిసోర్స్ పర్సన్లు భాగ్యలక్ష్మి, కుసుమ కుమారి అన్నారు. మహిళల సంఘాలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు మాట్లాడుతూ.. గ్రామ సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. క్రమం తప్పకుండా పొదుపు కట్టడం, అంతర్గత అప్పులు ఇవ్వడం, సంఘాల పుస్తకాలు రాయడం వంటి వాటిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు వెంకటేశ్వరి, అశ్విని, సీసీలు ఆంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డుకోవడం సరికాదు

అయిజ: రెవెన్యూ అధికారులు మాదాసి కుర్వ, మాదారి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డుకోవడం సరికాదని కుర్వ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిక్కయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మాదాసి కుర్వ, మాదాసి మాదారి కుర్వ జిల్లా నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయిజ మండల కన్వీనర్‌గా ఉప్పల క్యాంపు గ్రామానికి చెందిన కేపీ రాజేష్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

‘ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి ‘ఏ’లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రిటైర్డ్ ముదిరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ మంది ముదిరాజ్‌లను గెలిపించాలని కోరారు. అందరూ చైతన్యవంతులై రాజకీయంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, నారాయణ, కోట్ల హనుమంతు పాల్గొన్నారు.

సందర్శకులతో జూరాల కిటకిట



కిలో మీటర్ మేర బారులు తీరిన వాహనాలు

- పెద్దఎత్తున తరలి వచ్చిన సందర్శకులు
- ప్రాజెక్టు రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్

ధరూరు: ఎగువన కురిసిన భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. గత రెండు వారాలుగా వస్తున్న వరదతో ప్రాజెక్టుకు కొత్త కళ సంతరించుకుంది. గేట్లను ఎత్తడంతో సందర్శకులు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. కృష్ణమ్మ అందాలను తిలకించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శికుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచి సందర్శకులతో జూరాల ప్రాజెక్టు కిటకిటలాడింది. ప్రాజెక్టు వద్ద గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు రోడ్డుపై కిలో మీటర్ పొడవునా వాహనాలు నిలిచి ట్రాఫిక్ జాం అవుతున్నా పట్టించుకోలేదని సందర్శకులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



జూరాల ప్రాజెక్టుపై సందడి చేస్తున్న సందర్శకులు



క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరదను తిలకిస్తున్న పర్యాటకులు

గ్రూప్-1కు ఎంపికైన ఫారెస్టు బీట్ ఆఫీసర్



పాన్‌గల్: కొల్లాపూర్ ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ముంత శ్యామ్‌సుందర్ యాదవ్ గ్రూప్–1కు ఎంపికయ్యారు. టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో 900 మార్కులకు గాను 456 మార్కులు సాధించాడు. ఈ క్రమంలో రెండో విడతలో టీజీపీఎస్సీ ఎంపిక చేసిన 24 మందిలో ఇతను ఎంపికయ్యాడు. పాన్‌గల్ మండలం శాగాపూర్ గ్రామానికి చెందిన ముంత సుజాత, ముంత సుబ్బయ్యల కుమారుడు సుందర్ యాదవ్ 2019లో పంచాయితీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఉద్యోగం చేస్తూనే సిద్ధమై 2021లో ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించి ఇప్పుడు గ్రూప్–1కు ఎంపికయ్యాడు. గ్రూప్–1కు ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టాలి



వనపర్తి రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి అన్నారు. పెబ్బేరు మున్సిపాలిటీలోని 12 వార్డులో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. లబ్ధిదారులతో కలసి ముగ్గువేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వెంకట్రాములు, కె దయాకర్‌రెడ్డి, నరసింహ్మ, శివసాయి, సత్యనారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బావికి రక్షణ గోడ నిర్మించాలి

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి పెబ్బేరుకు వెళ్లే ప్రధాన రోడ్డులో గోవర్ధనగిరి గ్రామ సమీపంలో బీటి రోడ్డుకు ఆనుకొని ఉన్న బావికి రక్షణ గోడను నిర్మించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డుకు ఆనుకొని మలుపు వద్ద బావి ఉండడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బావికి రక్షణ గోడను నిర్మించాలని కోరారు.



సీఎం, మంత్రి జూపల్లి చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహిస్తున్న గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లి గ్రామ లక్ష్మీ నర్సింహ ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ నిధులు దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్(సీజీఎఫ్) కమిటీ ఆమోదం ద్వారా, దేవాదాయ శాఖ మంత్రి ఆమోదంతో, మంత్రి జూపల్లి ప్రత్యేక కృషితో మంజూరైనట్లు గ్రామస్తులు తెలిపారు. మొత్తం నిధులలో మొదటి విడతగా రూ.25 లక్షల పనులు ఈ ఆర్థిక సంవత్సరం నుంచే ప్రారంభించేందుకు పరిపాలన అనుమతులు మంజూరైనట్లు వారు పేర్కొన్నారు. మంత్రి జూపల్లి ప్రత్యేక కృషితోనే ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, కొండల్, శంకరయ్య, రాములు, శివారెడ్డి, స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ



ఇళ్ల మధ్య పారుతున్న మురుగును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు సతీష్, యాదగిరి

వనపర్తిటౌన్: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా 11వ వార్డులో డ్రెయినేజీ లేకపోవడంతో దుర్గంధం వెదజల్లి అవస్థలు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు పారేందుకు వీలు లేకుండా పోవడంతో దోమల బెడద అధికంగా ఉందని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని ప్రజలు చేసిన విజ్ఞప్తి మేరకు కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సతీష్, మాజీ కౌన్సిలర్ యాదగిరి ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. అనంతరం సమస్యలను ఫోన్‌లో ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

ముస్లిం మైనార్టీ పట్టణ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో ముస్లిం పెద్దలు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని ఉర్దూఘర్ షాదీఖానాలో ఇమామ్, మౌజన్‌లు ఆదివారం పట్టణ మైనార్టీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా అబ్దుల్ లతీఫ్, ప్రధాన కార్యదర్శిగా సైకిల్‌షాప్ సుల్తాన్, కోశాధికారిగా సిటీ టైలర్ గఫార్, ఉపాధక్షులుగా ఎంఐఎం రహీం, ఖాజా మైనోద్దీన్, వసీంఖాన్, వహీద్‌అలీ, బిస్మిల్లాఖాన్, డాక్టర్ సాజీద్‌అలీ, ఖదీర్‌ఖాన్, మజీద్‌ఖాన్, ఇజాజ్ అహేమద్, అలీబాబా, ఆజంమౌలా, ఫయాజ్ సహాయ కార్యదర్శిగా రజియోద్దీన్, ప్రచార కార్యదర్శులుగా తయ్యబ్, ప్లంబర్ మతీన్, చాంద్‌పాషా, గౌరవ సలహాదారులుగా సలీంఖాన్, కరెంట్ సలీం సాబ్, కరెంట్ ఖాళీక్ సాబ్, సయ్యద్‌లాల్, బాబాసాబ్‌తో పాటు 50 మంది కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు.

‘కాంగ్రెస్ నాయకులను నిలదీయండి’



ఏదులలో బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

గోపాల్‌పేట: ఎన్నికలలో అనేక హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత హామీలు నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎండగట్టాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఆదివారం ఏదుల మండల బీఆర్‌ఎస్ నాయకులతో పాటు గోపాల్‌పేటలోని బీఆర్‌ఎస్ నాయకులు ఆయా గ్రామాలను సందర్శించి ప్రజా సమస్యలపై మాట్లాడారు. అమలు కానీ హామీలు ఇచ్చి ఇప్పటికీ పూర్తిస్థాయిలో నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇళ్ల వద్దకు వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేష్, రాజు రెడ్డి, అబ్దుల్ మహమూద్, సునీల్, గోపాల్‌పేట మండలంలో బాల్‌రాజు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతనే కృష్ణుడి బోధ



ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత భగవద్గీతనే శ్రీకృష్ణుడి నిజబోధ అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట, పెబ్బేరు కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణుడని మాత్రమే జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత గ్రంథాలను ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తం, మాసన్న వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేశ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు

ఖిల్లాఘనపురం: తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెలవేర్చాలని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు కోరారు. ఆదివారం ఖిల్లాఘనపరంలో ఎమ్మార్పీస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మంద కృష్ణమాదిగ నేతృత్వంలో 30 ఏళ్లుగా ఎమ్మార్పీస్ పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. జూలై 7న ఎమ్మార్పీస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో పండుగలా నిర్వహించాలని సూచించారు. జెండాలను ఎగరవేసి ప్రతి గ్రామంలో సంబురాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మయ్య మాదిగ, ఎంఎస్పీ వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ గట్టుస్వామి మాదిగ, టైగర్ జంగయ్య, పరుశురాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య లోపం



పాన్‌గల్ పీహెచ్‌సీ ఆవరణలో చెత్తా చెదారం



పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

పాన్‌గల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు వారి కార్యాలయాలల్లో పారిశుద్ధ్యంపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదు. ముఖ్యంగా ఆరోగ్యంపై అవగాహన కల్పించే వైద్య ఆరోగ్య శాఖ తమ ఆస్పత్రి ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్త, చెదారం తొలగించకపోవడం, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్త, చెదారంతో ఆయా కార్యాలయాల్లో పారిశుద్ధ్యం లోపించిందని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తమ కార్యాలయాల ఆవరణలో పారిశుద్ధ్యం చర్యలు చేపట్టి ఆదర్శంగా నిలవాలని కోరుతున్నారు.